సాక్షి
కుమురం భీం

ఆదివారం । 5 । జనవరి । 2025



సంక్రాంతికి ప్రత్యేక బస్సులు
సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారి కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఆదిలాబాద్ రీజియన్ నుంచి సంస్థ ప్రత్యేక బస్సులు నడవనుంది. 8లో▸



పచ్చని శోభకు సన్నద్ధం
పల్లెల్లో నర్సరీలు సిద్ధమవుతున్నాయి. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకానికి అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.7 /15.1

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఉదయం మంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళల రక్షణకు పెద్దపీట
ఆసిఫాబాద్: జిల్లాలోని మహిళల రక్షణకు పెద్దపీట వేస్తున్నామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని షీటీంలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు డిసెంబర్‌లో 20 ప్రాంతాలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. 54 హాట్‌స్పాట్‌లు గుర్తించి షీటీంలు 92 సార్లు సందర్శించాయని పేర్కొన్నారు. హాట్‌స్పాట్‌ల వద్ద నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. భరోసా కేంద్రంలో ఇప్పటివరకు 22 కేసులు నమోదు కాగా, ముగ్గురికి నష్ట పరిహారం వచ్చిందని తెలిపారు. భరోసా కేంద్రం ద్వారా 12 పాఠశాలల్లోని బాలబాలికలకు అవగాహన కల్పించామన్నారు. 17 మంది బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి తెలుసుకున్నామని పేర్కొన్నారు. బాధితులు డయల్ 100, షీటీం వాట్సాప్ నంబర్లు 87126 70564, 87126 70575కు ఫోన్ చేయాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని ఇందాపూర్ సమీపంలో నిర్వహించే పోతురాజ్, ధర్మరాజ్ ఉత్సవాల పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మండల కేంద్రంలో ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్ ఆవిష్కరించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించే వేడుకలకు హాజరు కావాలని ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు సిడాం గంగు, చైర్మన్ సిడాం రాజు, వైస్ చైర్మన్ సిడాం ధర్మూ, కో కన్వీనర్ సిడాం భీము, కోశాధికారి సిడాం చిన్నభీము, కారోబార్ సిడాం పొచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



రవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి రవి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. పాఠశాల ఆవరణ శనివారం పీడీ శంకర్‌తో కలిసి విద్యార్థిని అభినందించారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన రవి జాతీయస్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 5 నుంచి 9 వరకు మహారాష్ట్రలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. అధ్యాపకులు సంతోష్, రహీం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న స్వీపర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: 25 ఏళ్లుగా శాఖా గ్రంథాలయాల్లో పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచాలని జిల్లాలోని పార్ట్‌టైం స్వీపర్లు శనివారం హైదరాబాద్ రాష్ట్ర గ్రంథా లయ పరిషత్ చైర్మన్ రియాజ్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ స్వీపర్లకు మొదట రూ.650, రూ.1250 ఇవ్వగా.. గతేడాది ఫిబ్రవరి నుంచి రూ.6వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. రూ.20వేలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. సయ్యద్ సలీం, గోపి, అరుణ, బుచ్చన్న, రాజన్న, రామయ్య, రాజారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధనం కష్టాలు!

- పోలీసు వాహనాలకు 10 నెలలుగా విడుదల కాని ఫ్యూయల్ ఫండ్స్
- పెట్రోల్ బంకుల్లో పేరుకుపోయిన బకాయిలు
- జిల్లావ్యాప్తంగా ప్రతినెలా రూ.10 లక్షలకు పైగా ఖర్చు
- బిల్లులు రాకపోవడంతో సొంతంగా వెచ్చిస్తున్న పోలీసులు
- నిధుల విడుదలకు ఆర్థికశాఖ కార్యదర్శికి ఐజీ స్వయంగా లేఖ



జిల్లా కేంద్రంలో పోలీసు పెట్రోకార్

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా గస్తీ పోలీసులను డీజిల్, పెట్రోల్ కష్టాలు వెంటాడుతున్నాయి. గత పది నెలలుగా పోలీసు స్టేషన్లకు ఇచ్చే ఫ్యూయల్ ఫండ్స్ ఆర్థికశాఖ నుంచి విడుదల కాలేదు. పెట్రోలింగ్ వాహనాలు మూలకుపడే పరిస్థితి నెలకొంది. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో పోలీసులకు సర్కారు ఇన్నోవా వాహనాలను అందించింది. గస్తీ నిర్వహించేందుకు ప్రతీ స్టేషన్‌కు రూరల్ ఏరియాలో ఒకటి, అర్బన్‌లో రెండు వాహనాలను కేటాయించింది. అయితే ప్రభుత్వం పెట్రో నిధులు విడుదల చేయకపోవడం.. పెట్రోల్ బంకుల యజమానులు అప్పుగా ఇవ్వడానికి నిరాకరించడంతో పోలీసుస్టేషన్ ఉన్నతాధికారులే ఇంధన ఖర్చులు భరిస్తున్నారు.

200లకు పైగా పోలీసు వాహనాలు

జిల్లాలో పెట్రోకార్లు 11 ఉండగా.. బ్లూకోల్ట్స్ బైక్‌లు 37 ఉన్నాయి. ఇవి కాకుండా ఆఫీసర్ కార్లు 20, స్టేషన్ హౌస్ ఆఫీసర్ కార్లు 17 వరకు ఉన్నాయి. వీటితోపాటు బాంబు స్క్వాడ్, ఆర్‌వోబీ, వీఐపీ ఎస్కార్ట్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది కోసం మరో 115 వాహనాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో పెట్రోకార్‌కు నెలకు 120 లీటర్లు, ఎస్పైస్థాయి అధికారి తిరిగే బొలెరో వాహనానికి 110 లీటర్లు, బ్లూకోల్ట్స్ బైక్‌లకు 25 లీటర్ల చొప్పున సర్కారు ఇంధనం అందిస్తోంది. ఇలా జిల్లాలో దాదాపుగా 200 పైగా వాహనాలకు ప్రతినెలా డీజిల్, పెట్రోల్ కోసం రూ.10 లక్షలకు పైగా ఖర్చవుతున్నట్లు సమాచారం.

ఇంధనం కొరత.. అరకొర గస్తీ

పోలీసుశాఖలో పెట్రోలింగ్, ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్న వాహనాలకు జిల్లాలో తొమ్మిది పెట్రోల్ బంకుల్లో బకాయి కింద డీజిల్, పెట్రోలు నింపుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసినప్పుడు ఆయా బంకుల యజమానులకు పోలీసు అధికారులు బిల్లులు చెల్లించేవారు. అయితే 2023- 24 ఆర్థిక సంవత్సరంలో 5 నెలలు, 2024- 25 ఆర్థిక సంవత్సరం మరో 5 నెలల ఇంధనం బిల్లులకు సంబంధించిన నిధులను ప్రభుత్వం జిల్లాకు విడుదల చేయలేదు. దీంతో పెట్రోల్ బంకుల్లో రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయి. గతంలో పోసిన డీజిల్ బిల్లులకు అతీగతి లేకపోవడంతో యజమానులు పోలీసు వాహనాలకు డీజిల్, పెట్రోల్‌ను అప్పుగా ఇవ్వడానికి ససేమిరా అంటున్నారు. జిల్లాలోని దాదాపు స్టేషన్ హౌస్ అధికారులు అందరూ పెట్రోల్ బంక్ యజమానులను బతిమిలాడి పెట్రోలింగ్ వాహనాల్లో ఇంధనం పోయించుకుంటున్నట్లు తెలిసింది. మరికొందరు అధికారులు డీజిల్, పెట్రోల్ కోసం ఇతరుల వద్ద అప్పు చేయడం లేదా చేతి నుంచి ఖర్చు పెట్టుకోవడం ద్వారా కొన్నాళ్లు నెట్టుకురాగా... ప్రస్తుతం వారు కూడా చేతులెత్తేసే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. దీంతో గల్లీల్లో గస్తీ బండే కనిపించడం లేదు. రాత్రిపూట అరకొరగా గస్తీ కాస్తున్నా పగటి పూట ఆ సంగతే మరిచారు.

రూ.కోటికి పైగా బకాయిలు

జిల్లావ్యాప్తంగా పోలీసు పెట్రోలింగ్ వాహనాలకు కోసం వినియోగించిన ఇంధనం బిల్లులు రూ.కోటికి పైగా బకాయి ఉన్నట్లు సమాచారం. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయాన్ని మల్టీజోన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. గత 10 నెలలు డీజిల్ బిల్లులు రాకపోవడంపై స్వయంగా ఐజీ స్థాయి అధికారి ఒకరు ఆర్థిక శాఖ కార్యదర్శికి లేఖ రాసినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ డీజిల్ బిల్లులు విడుదల చేసిన ప్రభుత్వం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించిన బిల్లులను మాత్రమే విడుదల చేయకపోవడంపై పోలీసు శాఖలోని ఉన్నతాధికారులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సర్కారు చేస్తోన్న జాప్యం వల్ల జిల్లాలో గస్తీ పెట్రోలింగ్ మూలన పడుతుందన్న వాదన వినిపిస్తోంది.

భద్రతా మాసోత్సవాలు విజయవంతం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్: రోడ్డు భద్రతా మాసోత్సవాలు విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ నుంచి శనివారం రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, రవాణా, ఆర్టీసీ, విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ నెల 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ జిల్లాలో అవగాహన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌ల ద్వారా సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించాలన్నారు. నిబంధనలపై అవగాహన కల్పించేందుకు జిల్లా, మండల కేంద్రాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటించని వాహనదారుల లైసెన్సు రద్దు చేసి, భవిష్యత్తులో వారు తిరిగి పొందకుండా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, జిల్లా రవాణాశాఖ అధికారి రాంచందర్, ఆర్టీసీ డీఎం విశ్వనాథ్, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి సజీవన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 45 ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. ప్రమాదాల నియంత్రణకు మూల మలుపుల గుర్తింపు, స్పీడ్ బ్రేకర్లు, సూచికలు ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. పట్టణాల్లోని కూడళ్ల వద్ద రోడ్డు ఆక్రమణలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్‌రూరల్: పదో తరగతి వార్షిక ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన అందిస్తుందని తెలిపారు. విద్యాశాఖ రూపొందించిన శతశాతం సాధన కార్యక్రమం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ప్రధానోపాధ్యాయుడు దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించేందుకు చర్యలు



వసతులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్‌తో కలిసి తనిఖీ చేశారు. సరుపాయాలు, పరికరాలు, ఆహార సామగ్రి నాణ్యతను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు మెరుగుపర్చాలన్నారు. విద్యుత్, తాగునీరు, వసతులను పూర్తిస్థాయిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించాలని సూచించారు. గర్భిణుల వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదు చేసుకుని వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన మందులు, పౌష్టికాహారం సకాలంలో తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సీడీపీవో సదియ, ఏపీవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజమల్లు

ఆసిఫాబాద్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎంవీఐ రాజమల్లు అన్నారు. ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్‌లోని డీటీవో కార్యాలయంలో శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మరో అధికారి మోహన్‌తో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నెల రోజులపాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో అరుణబాయి, సిబ్బంది వినీత్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



బహుమతి ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఓల్డ్)లో శనివారం తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పాటవ పరీక్ష నిర్వహించారు. విజేతలకు కొత్తపల్లి వెంకటలక్ష్మి, చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, అనిత దంపతులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, సాంఘిక శాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లాలాజీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మరుగుదొడ్లు వాంకిడి మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ హాస్టల్‌లోనివి. బీసీ హాస్టల్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం ఎస్సీ హాస్టల్ భవనంలో కొనసాగిస్తున్నారు. 96 మంది బీసీ విద్యార్థులు, 36 మంది ఎస్సీ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ ఒకే భవనం ఉండటంతో గదులు సరిపోవడం లేదు. అలాగే శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో ఉరుస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా మారడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



ఆసిఫాబాద్‌లో ప్రీమెట్రిక్ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో ఉరుస్తుండటంతో విద్యార్థులు పడుకునే పరిస్థితి లేదు. 83 మంది ఇక్కడ వసతి పొందుతుండగా, సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనగా.. మిగితా వాటిల్లోనూ వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

అధ్వానంగా హాస్టళ్లు



ఆసిఫాబాద్‌లోని బీసీ బాలికల వసతి గృహం

- జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో వసతుల లేమి
- సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ పోస్టుమెట్రిక్ వసతిగృహంలో చదువుకుంటున్న విద్యార్థిని వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో జిల్లాలో వసతిగృహాల్లోని వసతుల లేమి మరోసారి చర్చనీయాంశంగా మారింది. వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతిగృహంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని చౌదరి శైలజ అస్వస్థతకు గురై మృతి చెందిన 25 రోజుల వ్యవధిలో ఈ ఘటన జరగడం కలకలం రేపింది. వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

11 బీసీ వసతి గృహాలు

జిల్లావ్యాప్తంగా 11 బీసీ డే కేర్ వసతి గృహాలు ఉన్నాయి. 2024- 25 విద్యా సంవత్సరంలో 850 మంది బాలబాలికలు బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పాఠశాలాలు, కళాశాలల్లో చదువుకుంటున్నారు. ప్రీమెట్రిక్ వసతి గృహాలు ఏడు ఉండగా అందులో ఆరు బాలురకు చెందినవి ఉన్నాయి. ఆయా చోట్ల 546 మంది విద్యార్థులు, బాలికల వసతి గృహంలో 18 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఇక నాలుగు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 292 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో రెండు బాలిక వసతి గృహాల్లో 134మంది, రెండు బాలుర వసతి గృహాల్లో 158 మంది విద్యను అభ్యసిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటాం


బీసీ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. సంబంధిత వార్డెన్లు 24 గంటలపాటు వసతిగృహాల్లోనే ఉండే విధంగా చూస్తాం. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– సజీవన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి

సౌకర్యాలు లేక అవస్థలు

జిల్లాలోని మొత్తం 11 బీసీ వసతి గృహాల్లో ఆరు అద్దె భవనంలో కొనసాగుతుండగా, ఐదింటికి సొంత భవనాలు ఉన్నాయి. ఆయా చోట్ల సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాలు ఉన్నవాటిలో కూడా వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఆసిఫాబాద్ బాలుర హాస్టల్, వాంకిడి బీసీ బాలుర, కెరమెరి బాలుర, కౌటాల బాలుర వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. కిటికీలకు తలుపులు లేవు. వర్షాకాలంలో భవనాలు ఉరుస్తున్నాయి. సరిపడా మరుగుదొడ్లు కూడా లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చన్నీటితో స్నానాలు చేస్తూ ఏటా వణుకుతున్నారు. సమస్యలు ఉన్నతాధికారులు, వార్డెన్లకు చెప్పినా ఉపయోగం ఉండటం లేదు. మరమ్మతులకు నిధులు మంజూరు కావడం లేదని చెబుతున్నారు. ఆర్వో ప్లాంట్లు, గదులకు మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఒంటి కాలిపై హమాలీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నాలుగు రోజులుగా సివిల్ సప్లై హమాలీల సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం హమాలీలు ఒంటి కాలుపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీల నూతన రేట్ల ఒప్పంద జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ఈ నెల 6న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేసి వినతిపత్రాలు ఇవ్వాలని సివిల్ సప్లై, జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్‌ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, అంజి, కిషన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'సమగ్ర' ఉద్యోగుల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: న్యాయమైన డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ అక్షరాల ఆకారంలో కూర్చుని మానవహారం చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులపై చిన్నచూపు తగదన్నారు. వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేశ్ పాల్గొన్నారు.



వన్యప్రాణులను వేటాడితే చర్యలు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎఫ్‌డీవో

బెజ్జూర్(సిర్పూర్): వన్యప్రాణులను వేటాడితే చర్యలు తప్పవని కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్ అన్నారు. మండలంలోని ఏటిగూడ, గబ్బాయి గ్రామాల్లో శనివారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అడవుల సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. పంటల రక్షణ పేరుతో విద్యుత్ తీగలు, ఉచ్చులు, విషప్రయోగం చేయవద్దని సూచించారు. వన్యప్రాణులు సంచరిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం బెజ్జూర్, సులుగుపల్లి, జైహింద్‌పూర్ ప్లాంటేషన్లను పరిశీలించారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌వో ముసావీర్, డీఆర్‌వో శ్రావణ్, ఎఫ్ఎస్‌వోలు, బీట్ అధికారులు ఉన్నారు.

రేపు గోలేటికి ఎమ్మెల్సీ కవిత

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయానికి సోమవారం సాయంత్రం 3గంటలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వస్తున్నట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కార్మికులను ఉద్దేశిస్తూ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఏరియాలోని సింగరేణి కార్మికులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


మహేశ్ (ఫైల్)

దండేపల్లి: కడుపు నొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం ..మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన మెండ మహేశ్ (24) గత రెండేళ్ల క్రితం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున పెద్ద ఆసుపత్రిలో చూపించలేదు. దీంతో తరచూ కడుపు నొప్పితో బాధపడేవాడు. ఈక్రమంలో నొప్పి భరించలేక శుక్రవారం గ్రామ పంచాయతీ భవనం సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. రాత్రి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బైక్ పైనుంచి పడి కార్మికుడు మృతి


రాజేశ్ (ఫైల్)

శ్రీరాంపూర్: అదుపుతప్పి బైక్‌పై నుంచి పడి సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ కథనం ప్రకారం.. తీగల్‌పహాడ్ ఏరియాలోని అల్లూరిసీతారామరాజునగర్‌లో నివాసం ఉండే గడికొప్పుల రాజేశ్(32) ఆర్కే 6 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లిలోని మిత్రుడు వద్దకు వెళ్లి కలిసి తన బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. అర్ధరాత్రి ఎన్‌హెచ్ 363 సీసీసీ నస్పూర్ ఫ్లైఓవర్ నుంచి సర్వీసు రోడ్డుకు దిగుతూ బైక్ అదుపుతప్పి కాలువలో పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం హైవే పెట్రోలింగ్ సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెళ్లి చూసే అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇసయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


దగ్ధమైన పత్తి

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామంలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో నిల్వ ఉన్న పత్తి దగ్ధమైంది. మాజీ సర్పంచ్ డోలే చిన్నక్క సుమారు 25 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు చెలరేగి నిల్వ పత్తిపై పడటంతో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై నీటిని చల్లి మంటలార్పివేశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకోలేకపోయారు. సిబ్బంది నడుచుకుంటూ వెళ్లి అక్కడి యువకులు, ప్రజలతో కలిసి మంటలార్పి వేశారు. ప్రమాదంలో దాదాపు రూ.10 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధం కాగా, రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని చిన్నక్క ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని కోరింది.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

- ఈనెల 7 నుంచి 13 వరకు..
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 290 సర్వీసులు
- 15 నుంచి 20 వరకు జేబీఎస్‌కు తిరుగు ప్రయాణం
- 195 బస్సులను సిద్ధం చేసిన ఆర్టీసీ



మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారి కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆదిలాబాద్ రీజియన్‌లో ఆయా డిపోల బస్సులను జేబీఎస్ నుంచి 7 నుంచి 13 వరకు 290 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈనెల 11 వరకు సెలవులు ప్రకటించడం, హైదరాబాద్‌కు వ్యాపార, ఉద్యోగరీత్యా వెళ్లినవారు.. చదువుల నిమిత్తం ఉన్న విద్యార్థులందరూ పండుగకు సొంతూళ్లకు వెళ్తుంటారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సులు నడిపేలా ఆర్టీసీ యోచిస్తోంది. మహాలక్ష్మీ పథకంతో హైదరాబాద్ నుంచి వచ్చే మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను మరింత పెంచనున్నట్లు తెలుస్తోంది.

ఈనెల 7 నుంచి 13 వరకు..

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గతంలో భైంసా, ఉట్నూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపిన ఆశించిన మేర ఆదాయం రాలేదు. ఈ ఏడాది ఈనెల 10, 11న మాత్రమే ఒక్కో బస్సు సర్వీసు నడపనుంది. అత్యధికంగా నిర్మల్ డిపో బస్సులు 88, మంచిర్యాల నుంచి 82 వరకు ఉన్నాయి. మిగిలిన ఐదు డిపోల నుంచి ఈనెల 7 నుంచి 13 వరకు బస్సులను జేబీఎస్ నుంచి గమ్యస్థానాలకు వెళ్లనున్నాయి. ఆదిలాబాద్ నుంచి 58, భైంసా-02 నిర్మల్-88 ఉట్నూర్-02, ఆసిఫాబాద్-58, మంచిర్యాల డిపో నుంచి 81 బస్సులను ఏర్పాటు చేశారు. ఈనెల 10 నుంచి ప్రయాణికుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో అధిక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

తిరుగు ప్రయాణంలో కూడా..

సంక్రాంతి నేపథ్యంలో తిరుగు ప్రయాణంతో రద్దీ అధికంగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వచ్చి వెళ్లేవారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. రద్దీకి అనుగుణంగా బస్సుల రాకపోకలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ డిపోల నుంచి ఈనెల 15 నుంచి 20 వరకు 195 బస్సులు నడపనున్నారు. ఆదిలాబాద్ డిపో బస్సులు 31, భైంసా 4, నిర్మల్ 71, ఉట్నూర్ 1, ఆసిఫాబాద్ 38, మంచిర్యాల 50 బస్సులను తిరుగుప్రయాణానికి వెళ్లే వారి కోసం జేబీఎస్ వరకు ఆర్టీసీ బస్సులను నడపనుంది.

రద్దీకి అనుగుణంగా బస్సులు



పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడుపుతాం. రద్దీ ఎక్కువగా అప్పటికప్పుడు బస్సులు ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీలే ఉంటాయి. రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. బస్సు ఎక్కేటప్పుడు క్యూ పద్ధతి పాటించాలి. ప్రయాణికులకు జేబీఎస్ బస్‌స్టేషన్‌లో ఎప్పటికప్పుడు బస్సుల సమాచారం అందిస్తారు.

– సోలోమాన్, ఆర్ఎం, ఆదిలాబాద్

జేబీఎస్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు బస్సుల వివరాలు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
07	02	0	03	02	03
08	02	0	03	02	02
09	04	0	06	04	06
10	15	01	23	15	20
11	15	01	23	15	20
12	10	0	15	10	15
13	10	0	15	10	15

ఉట్నూర్ డిపో బస్సుల రాకపోకలు: ఈనెల 10, 11న బస్సు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

తిరుగు ప్రయాణం కోసం..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
15	07	02	15	08	10
16	08	02	16	10	12
17	04	0	10	05	07
18	04	0	10	05	07
19	04	0	10	05	07
20	04	0	10	05	07

ఉట్నూర్ డిపో నుంచి ఈనెల 16న ఒక బస్సు మాత్రమే నడపనున్నారు.

చోరీ కేసులో మైనర్ అరెస్టు

బోథ్: చోరీ కేసులో మైనర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద గల ఈనెల 2న సూర్యవంశీ ఉలాజీ ఇంటికి తాళం వేసి చేనుకు వెళ్లాడు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో తన ప్యాంటు జేబులో ఉంచిన రూ. 10 వేల నగదు కనిపించలేదు. తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీని పరిశీలించారు. మైనర్ ఇంటి తాళం పగలకొట్టిన వీడియో రికార్డు అయింది. శనివారం మైనర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతని నుంచి రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు కడెం ఆయకట్టుకు నీటి విడుదల

కడెం: కడెం ఆయకట్టు యాసంగి పంటలకు ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు డీఈఈ నవీన్ పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తారని తెలిపారు.

చోరీకి గురైన వస్తువులు అప్పగించాలి

బెల్లంపల్లి: గతనెల 29వ రాత్రి తనపై హత్యాయత్నం చేసి చోరీ చేసిన తన వస్తువులను తిరిగి అప్పగించాలని ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణ కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనకు ప్రాణహాని ఉండటంతో బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్యకు శనివారం వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో యూనియన్ బ్యాంకు వీధిలో సెలూన్ షాప్‌వద్దకు వెళ్లగా రాగం శెట్టి సతీశ్, శ్యామ్ మరో ఆరుగురు తనపై హత్యాహత్నం చేశారన్నారు. ఆ దాడిలో తన వద్ద ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు చైన్, రూ.10,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలి


ఎంపికైన క్రీడాకారులతో పార్థసారథి

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా హాకీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం అండర్-19 ఉమ్మడి జిల్లాస్థాయి బాలుర హాకీ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాకీలో జిల్లా ఎన్నో అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చిందన్నారు. ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. వారందరి ప్రదర్శనను స్ఫూర్తిగా తీసుకొని జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7 నుంచి నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. సెలెక్టర్లు జె.రవీందర్, శ్రీనివాస్, అతుల్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా సైన్స్ కేంద్రంలో ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం ఫలితాలు, అత్యధిక మార్కులు సాధించటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పది పరీక్ష విధానంలో వచ్చిన మార్పులకనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అపార్ కార్డు, పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాల గ్రాంట్ల వినియోగం, సైబర్ కాంగ్రెస్ మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరీక్షల విభాగం అదనపు కమిషనర్ దామోదర్‌రావు, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, యశోధ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్యనారాయణమూర్తి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం తెల్లవారుజామున స్థానిక నారాయణరెడ్డి మార్కెట్‌లో గల మ్యాక్స్ మొబైల్ షాప్ తాళా న్ని ఒకరు పగులగొట్టి చోరీకి ప్రయత్నం చేస్తుండగా ఓ వ్యక్తి చూసి యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే యజమాని పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్పీ రాజేష్ మీనా, పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న ఎస్సై సందీప్‌తో కలిసి ఐదు నిమిషాల్లో వెళ్లి దొంగను స్వయంగా పట్టుకున్నాడు. కేసు నమోదు చేసి, మైనర్ కావడంతో శనివారం జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ తరలించారు. ఎస్పీ జానకీ షర్మిల ఈ సందర్భంగా ఏఎస్పీని అభినందించారు.

ఇంటి నిర్మాణ పనులు అడ్డుకున్నారని..

- పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- జిల్లాకేంద్రంలో ఘటన


రమేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా అడ్డుకున్న పోలీసులు


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్

నిర్మల్‌టౌన్: ఇంటి నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు అడ్డుకుంటున్నారని ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. జిల్లా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సోమవార్‌పేట్‌లో శక్కరి రమేశ్ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దీనికి అనుమతులు లేవని టీపీవో హరీశ్ తరచూ వచ్చి వేధిస్తూ పనులు అడ్డుకుంటున్నాడు. విసుగు చెందిన కుటుంబీకులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పెట్రోల్ డబ్బా పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా స్థానిక కౌన్సిలర్ మేడారం అపర్ణ-ప్రదీప్ బైఠాయించారు. మున్సిపల్ అధికారులు అందించిన సమాచారంతో పోలీసులకు అక్కడికి చేరుకున్నారు. తమ బాధను ఎవరూ పట్టించుకోకపోవడంతో రమేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న పోలీసులు పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. తమ సమస్య పరిష్కరించకుంటే కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకుంటామని రమేశ్ తెలిపాడు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ ఖమర్ అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పారు. అయినా రమేశ్ కొన్ని గంటలు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు.

యూత్ ఫెస్టివల్ విజేతలు రిపోర్టు చేయాలి

మంచిర్యాలటౌన్: స్వామివివేకానంద జయంతి పురస్కరించుకుని రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలు జరగనున్నాయి. ఈనెల 6, 7 తేదీల్లో సికింద్రాబాద్‌లోని బోర్డ్స్ క్లబ్స్ ట్యాంక్ బండ్, యూత్ సర్వీసెస్ హెడ్ ఆఫీస్ ఆడిటోరియంలో నిర్వహించే పోటీలకు వెళ్లే విజేతలు రిపోర్టు చేయాలని జిల్లా యువజనుల, క్రీడల శాఖ అధికారి రాజ్‌వీర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానంలో గెలిచి ఎంపికైన విద్యార్థులు సోమవారం ఉదయం 4 గంటలకు మంచిర్యాల బస్టాండ్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు బాక్సింగ్ కోచ్ రాజేశ్ సెల్ 9963539234 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. పాల్గొనే విద్యార్థులు రెండు పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు, ఏజ్ ప్రూఫ్ సర్టిఫికెట్, బోనాఫైడ్, ఎస్సెస్సీ మెమో జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు.

ఎంపికైన వారి వివరాలు..

పోయెట్రీలో బి.శ్రీవల్లి, స్టోరీ రైటింగ్‌లో ఏ.అంజలి, పెయింటింగ్‌లో ఏ.వర్ష, సైన్స్‌ఫేర్‌లో ఇన్షా తస్నీమ్, టి.అమూల్య, గ్రూప్ ఫోక్‌డాన్స్‌లో విష్ణుప్రియ, ఎస్.అక్షయ, స్నేహితవర్మ, ఈ.అక్షయ, భవ్య, అలేఖ్య, హర్షిని, వైశాలి, శ్వేత, కె.శృతి, గ్రూప్ ఫోక్ డ్యాన్స్ జె.మౌనిక, డి.మాలతి, బి.కాంతి, దీక్షిత, డిక్లమేషన్‌లో ఆర్.సౌమ్య, ఏ.లిఖిత ఎంపికయ్యారు.

ఐదుగురు బైండోవర్

సిర్పూర్(టి): పశువుల అక్రమ రవాణాలో పట్టుబడిన ఐదుగురిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. వీరిలో రాజేందర్, సతీశ్, సారయ్య, అఫ్జల్, భాస్కర్ ఉన్నారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పేకాటస్థావరంపై దాడులు

దహెగాం: ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండలంలోని ఇట్యాల శివారులో పేకాటస్థావరంపై శనివారం దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఏడుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి నుంచి రూ.35,320 నగదుతోపాటు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని దహెగాం పోలీసుస్టేషన్‌లో అప్పగించామన్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి జుగ్నాక్ వంశీయుల పెర్సపేన్ పూజలు


సమావేశమైన జుగ్నాక్ వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని పొల్లుగూడ గ్రామంలో ఈనెల 14 నుంచి పెర్సపేన్ పూజలు నిర్వహించనున్నట్లు జుగ్నాక్ వంశం కటోడ(పూజారి) జుగ్నాక్ మహాదు అన్నారు. గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశం పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. పూజల నిర్వహణ గురించి చర్చించారు. 15న పెర్సపేన్ పూజలు నిర్వహించి గ్రామం చుట్టూ ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. 16న కుల దేవతకు పుణ్యస్నానం ఆచరించడంతోపాటు అదేరోజు రాత్రి మహాపూజ ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశీయులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. జుగ్నాక్ వంశీయులు జుగ్నాక్ కాశీరాం, మానిక్‌రావ్, భారత్, జాలింరావ్, గ్రామపెద్దలు ఆత్రం శంకర్, భుజంగ్‌రావ్, కొరెంగా జుగాదిరావ్, మర్సుకోల నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యాబోధన తీరు గురించి పదో తరగతి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. రక్త నత అరికట్టేలా విటమిన్ ‘సీ’టాబ్లెట్లు ఇవ్వాలన్నారు. మొవా లడ్డూ, గుడ్లు, పాలు, రాగి మాల్టా అందించాలన్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయలు ఉన్నారు.

గిరిజన పోషణ మిత్ర పథకం ప్రారంభం

ఉమ్మడి ఆదిలాబాద్ ఐటీడీఏ పరిధిలోని 60 ఆశ్రమ బాలికల పాఠశాలలు, వసతి గృహాల్లో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. పథకం అమలుకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. వారంలో రెండు సార్లు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు సందర్శించి నివేదికను పీవోకు అందిస్తారని పేర్కొన్నారు. విద్యార్థినులు రక్తహీనత బారినపడకుండా ఇప్పపువ్వు లడ్డూ, విటమిన్ ‘సీ’, ఐరన్ మాత్రలను ప్రతీ వారం రెండు సార్లు అందిస్తారని తెలిపారు. ఐటీడీఏ ఉద్యాన నర్సరీల్లో పెంచిన కరివేపాకు, మునగ తదితర మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

‘గిరిజన పోషణమిత్ర’ పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని జామడ, నార్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో రికార్డులు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. మహువా లడ్డూతోపాటు విటమిన్ సి మాత్రలను వారంలో రెండుసార్లు విద్యార్థినులకు అందిస్తారన్నారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్ఎంలు చౌహాన్ వందన, విఠల్, వార్డెన్ వనిత పవర్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

9న జాబ్‌మేళా

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపా రు. హైదరాబాద్‌లోని గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీలో ఒక జూనియర్ కెమిస్ట్ పోస్టుకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. 2023-24లో ఇంటర్ ఎంపీసీ/బైపీసీ పూర్తయి, కెమిస్ట్రీ సబ్జెక్టుతో డిగ్రీ చదువుతున్న ఉమ్మడి జిల్లా విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఇందులో ఎంపికైనవారికి ఏడాదికి రూ.2.05 లక్షల జీతం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణలో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ 9885762227 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నీల్వాయిలో బర్డ్‌వాక్


బర్డ్‌వాక్ నిర్వహిస్తున్న అధికారులు

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం బర్డ్‌వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ ఎన్నో వైవిధ్యమైన పక్షి జాతులు ఉన్నట్లు రిసోర్స్‌పర్సన్ రాంజాన్ విరాని గుర్తించారు. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీల్వాయి ప్రాజెక్టు పరిసరాలు అరుదైన పక్షులకు నిలయమని నీల్వాయి, చెన్నూర్ అటవీ రేంజర్లు అప్పలకొండ, శివకుమార్ తెలిపారు. డీఆర్వోలు ప్రమోద్‌కుమార్, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి


మాట్లాడుతున్న లంకా రాఘవులు

ఎదులాపురం: వ్యవసాయ కూలీలకు కూలీబంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సుందరయ్య భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ కూలీలకు కూలీబంధు అమలు చేయాలని, గ్రామసభలో అర్హులైన కూలీలను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు ఈ ధర్నాలో అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు ఆశన్న, కిష్టన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.